ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, ఏప్రిల్ 10 : ప్రజలు తన దృష్టికి తెచ్చిన ప్రతీ సమస్యను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రజలు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కూకట్‌పల్లి'లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ,ఏప్రిల్ 10: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో (కేజీ-రూపాయలు) కూరగాయల ధరలు కింది విధంగా ఉన్నాయి. టమాట-17, వంకాయ -18, బెండకాయ -45, పచ్చిమిర్చి - 55, బజ్జి మిర్చి- 35, కాకరకాయ- 35, బీరకాయ- 40, క్యాబేజి-21, ఫ్రెంచ్ బీన్స్ -55, క్యారెట్ -25, కాలీఫ్లవర్ -20, దొండ-18, చిక్కుడు- 50, గోరుచిక్కుడు -28, బీట్‌రూట్ -23, క్యాప్సికం- 65,ఆలుగడ్డ -35, కీరా-22, దోసకాయ- 17, సొరకాయ-9, పొట్లకాయ(1)-18, కందగడ్డ- 65, ఉల్లి పొరక -55, ఉల్లిగడ్డ -22, మామిడికాయ- 10 నుంచి 15, అరటికాయ -8 నుంచి 9, చామగడ్డ -35, ముళ్లంగి(1)-4 నుంచి 5, మొరంగడ్డ -18, గుమ్మడికాయ-40, నిమ్మకాయలు- 55 నుంచి 60, మునగకాయ-4 నుంచి 5, బొప్పాయి-40, ఎండుమిర్చి 200, అల్లం 180, వెల్లుల్లి 220, చింతపండు 140 రూపాయలుగా ఉన్నాయి.

రిజర్వాయర్లు కట్టినా.. తాగునీటి సమస్యలా!

● శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఇంద్రహిల్స్ బస్తీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, ఏప్రిల్ 10 : గత బీఆర్ఎస్ పాలనలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా తగినన్ని రిజర్వాయర్లను నిర్మించామని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం తగినంత తాగునీరు సరఫరా చేయడం లేదని శేరిలింగింపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. తక్షణమే తాగునీటి సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. బుధవారం ఎమ్మెల్యే గాంధీ ఆల్విన్ కాలనీ డివిజన్ ఇందిరా హిల్స్‌లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను తెలుసుకునేందుకు పాదయాత్ర నిర్వహించారు. కాలనీలో తాగునీరు సరిగా రావడం లేదని, తక్కువ ప్రెషర్‌తో నీరు వదులుతుండటంతో ఇబ్బందులు ఎదురువుతున్నాయని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే జలమండలి అధికారులతో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రజలకు సరిపడా తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో అసంపూర్తిగా మిగిలిన యూజీడీ పనులను త్వరిత గతిన పూర్తి చేస్తామన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు గణేశ్, కాశీనాథ్ యాదవ్, శ్రీనివాస్, రాజు, మల్లేశ్, పద్మా రావు, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు

నియోజకవర్గ ముస్లింలకు ఎమ్మెల్యే గాంధీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

కొండాపూర్ : క్రోధినామ సంవత్సరాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో బుధవారం నిర్వహించిన ఉగాది ఉత్సవాల్లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, ఉప్పల పాటి శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

ఎంటీపీఆర్ కంపెనీలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

బాలానగర్‌లోని ఎంటీపీఆర్ కంపెనీ యాజమాన్యంతో కార్మికుల సమస్యలపై మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 10 : బాలానగర్ ఎంటీపీఆర్ టెక్నాలజీ లిమిటెడ్ కంపెనీలో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే, కంపెనీ గౌరవాధ్యక్షుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంటీపీఆర్ కంపెనీ యాజమాన్యంతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, కార్మిక సంఘం నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కంపెనీలో పనిచేసే కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం చొరవ చూపాలన్నారు. కార్మికుల ఈపీఎఫ్‌లో వ్యక్తిగత సమాచారంలో సవరణలు, శాలరీ పే స్లిప్‌లో ఎల్ఐసీ కంట్రిబ్యూషన్ జమ చేయాలని, క్యాంటీన్ ఏర్పాటు చేసి పోషకాహారం అందించాలని, తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు. ఈడీఏ, అత్యవసర సమయాల్లో సెల్‌ఫోన్ వాడకం, గేట్‌పాస్‌ల అనుమతి, పార్కింగ్, పొల్యూషన్ నివారించే పనులను తక్షణమే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నేతలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలి

● కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష

కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో డీసీలు, అధికారులతో మాట్లాడుతున్న జడ్సీ అభిలాష

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 10 : అక్రమ నిర్మాణాలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని, తగిన చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అన్నారు. బుధవారం జోన్ ఆఫీస్‌లో డీసీలు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీలు, ఏఎంహోచ్‌లతో జడ్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, కాలనీలు, బస్తీల్లో జీవీపీలన్నింటినీ తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత మూడు నెలలుగా 101 జీవీపీలను తొలగించగా.. ఇంకా 147 జీవీపీలు ఉన్నట్లు తెలిపారు. వీటన్నింటిని తొలగించడం కోసం ఎస్‌హెచ్‌జీల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. స్వచ్ఛ ఆటోలు ప్రతి ఇంటికి వెళ్లి చెత్త, వ్యర్థాలను సేకరించేలా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ నిబంధనలు పాటించకుండా చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకోవాలన్నారు. రంజాన్ సందర్భంగా ఈద్గాల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దకే భద్రాద్రి సీతారాముల తలంబ్రాలు

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 10 : ఆర్టీసీ కార్గో సేవల ద్వారా భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలను ఇంటి వద్దకే పంపిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంవో కవిత, కూకట్‌పల్లి డిపో మేనేజర్ ఇసాక్‌బిన్ మహ్మద్ తెలిపారు. బుధవారం కూకట్‌పల్లి ఆర్టీసీ బస్ డిపోలో భద్రాద్రి సీతారాముల తలంబ్రాల ఆఫర్ వాల్ పోస్ట ర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 17న భద్రాచలంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం జరుగుతుందని, తలంబ్రాలను తీసుకోలేని వారికోసం ఆర్టీసీ సంస్థ ఈఅవకాశాన్ని కల్పించదన్నారు. ఈనెల 18లోగా రూ.151 చెల్లించిన భక్తులకు కార్గో ద్వారా ఇం టికే సీతారాముల తలంబ్రాలను పంపించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9154298824, 9154298839 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జమ్మన్న తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, కార్మిక సంఘాల నేతలు

దుండిగల్,ఏప్రిల్ 10 : వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్ హమాలీ సంఘం వారు అడ్డా వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రా న్ని సీఐ ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ ఏటా కార్మికులు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామమని అన్నారు. కార్మికులంతా ఒకరికొకరు సహకరించుకోవడం వల్ల సహృద్భావ వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్, సీపీఎం కార్యదర్శి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి, కార్యదర్శి శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు దేవదానం, డీవైఎఫ్ నాయకుడు అంజయ్య, సంఘాల నేతలు నర్సింహారెడ్డి, మహేందర్, శ్రీనివాస్, జార్జ్, చంద్రమౌళి, గురప్ప, యాగంటి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ చేవెళ్ల సభను విజయవంతం చేద్దాం..

నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

కొండాపూర్, ఏప్రి ల్ 10 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 13న చేవెళ్లలో నిర్వహించ నున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. బుధవారం ఆయన ఖాజాగూడలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో నిర్వహించనున్న ఈ బహిరంగ సభకు కార్యకర్తలను భారీగా తరలించి సభను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

ఇంకుడు గుంతలపై అవగాహన

ఉప్పల్, ఏప్రిల్ 10 : ప్రపంచ ధరిత్రి దినోత్సవంలో భాగంగా ఉప్పల్ హేమనగర్ కమ్యూనిటీ పార్కులో యోగ, షటిల్ సభ్యులు బుధవారం ఇంకుడు గుంతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భం గా పార్కును శుభ్రం చేసి, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. భూగర్భ జలాలు పెంపొందించేవిధంగా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్ర మౌళి, మోహన్‌రావు, కవిత, శారద, ధన లక్ష్మి, రాజేశ్, ప్రసాద్‌రెడ్డి, గిరి, రవియాదవ్, సుశీల, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ రాజు, హరిపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద రంజాన్ ఏర్పాట్ల పరిశీలన

అల్విన్ కాలనీ డివిజన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్

మియాపూర్ , ఏప్రిల్ 10 : రంజాన్ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల కోసం చేస్తున్న ఏర్పాట్లను బుధవారం కార్పొరేటర్లు పరిశీలించారు. అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్, హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు హైదర్‌నగర్ ఈద్గా వద్ద చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈద్గాల వద్ద అన్ని రకాల వసతులను కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. తాగునీరు, షామియానాలు ఇతర ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. వారి వెంట ఆయా డివిజన్‌ల నేతలు, ఈద్గా ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు

● ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

● కలెక్టర్ గౌతమ్ ఆదేశం

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 10 : జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు చేసినట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. తెలంగాణ సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ప్రభుత్వ ప్ర ధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అధికారులు నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ..జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు అందించే వనరులను గుర్తించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లే కుండా సరఫరా చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని, ఇప్పటికే ప్రారంభించిన సెంటర్లతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎండాకాలంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు, అవసరమైన ప్రణాళికలు తయారు చేసి వైద్య ఆరోగ్య శాఖకు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, అభిషేక్ అగస్త్య, డీఈఓ విజయ కుమారి, డీఆర్‌డీఓ సాంబశివరావు, డీపీఓ వెంకయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రఘునాథ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన ప్రజలు

దుండిగల్, ఏప్రిల్ 10 : ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ కాలనీల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. సానులకూంగా స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులతో చర్చించి, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

ఘట్‌కేసర్ చైర్‌పర్సన్‌పై వీగిన అవిశ్వాసం

ఘట్‌కేసర్, ఏప్రిల్ 10 : ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పావనీ జంగయ్య యాదవ్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపో యింది. బుధవారం అధికారులు నిర్వహించిన సమావేశానికి పాలకవర్గం సభ్యులు ఎవరు కూడా హాజరు కాకపోవడం తో చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయిందని ఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపా రు. ఘట్‌కేసర్ చైర్‌పర్సన్‌పై కొంత మంది సభ్యులు అవిశ్వాసం అంటూ కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఆర్డీఓ, కమిషనర్ ఎండీ సాబేర్ అలీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాలకవర్గం సభ్యులు ఎవరు కూడా హాజరు కాకపోవడంతో కలెక్టర్ వద్ద పెట్టిన దరఖాస్తు రద్దయినట్లు అధికారులు ప్రకటిం చారు.

రాజీనామా..

ఘట్‌కేసర్,ఏప్రిల్10: బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి ఘట్‌కేసర్ చైర్‌పర్సన్ ముల్లి పావనీ జంగయ్య యాదవ్ బుధవారం రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా లేఖను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పంపారు.

ఆర్థిక సాయం

శామీర్‌పేట, ఏప్రిల్ 10 : అలియాబాద్ జడ్పీహెచ్ఎస్ 1991-92 విద్యార్థులు.. తమ స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. శామీర్‌పేట మండలం, అలియాబాద్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బాబు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న తోటి 1991-92 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు.. బాబు కూతుళ్ల పేరుపై రూ.20 వేలను ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్లను బుధవారం అందజేశారు.

15, 16 తేదీల్లో యువజనుల సదస్సు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 10: రాష్ట్రంలోని యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ నెల15, 16 తేదీల్లో హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర తెలిపారు.

మారిన నిబంధన.. వృద్ధులకు సదావకాశం

● 85 ఏండ్లు దాటిన వారు ఇంటి నుంచి ఓటు వేసేందుకు అర్హులు..

● దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

గత అసెంబ్లీ ఎన్నికల్లో వృద్ధురాలి నుంచి ఫారం 12 డీని స్వీకరిస్తున్న సిబ్బంది(ఫైల్)

మియాపూర్, ఏప్రిల్ 10 : వచ్చే నెలలో పార్లమెంటు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఇప్పటికే పోలింగ్ విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవోలు, ఓపీవోలకు తొలి విడుత శిక్షణ ప్రారంభమైంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లోనే ఎన్నికల సంఘం తొలిసారిగా వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని కల్పించిన సంగతి తెలిసిందే. 80 ఏండ్లు నిండిన ఓటర్లు ఇంటి నుంచే ఓటు వేసేందుకు అవకాశం కల్పించగా.. రాష్ట్రంలోనే అతి పెద్దదైన శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సుమారు 800 మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు.

వచ్చే నెలలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే ఓటర్ల వయసు నిబంధనను ఎన్నికల సంఘం సవరించింది. ఇకపై 85 ఏండ్లు నిండిన వారు మాత్రమే ఇందుకు అర్హులుగా పేర్కొన్నది. ఇప్పటికే పలు సందర్భాలలో ఉన్నత స్థాయిలో నిర్వహించిన ఎన్నికల నిర్వహణ సమావేశాల్లో ఈ విషయమై కింది స్థాయి అధికారులకు స్పష్టం చేసింది. సవరించిన వయసు ప్రకారం.. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో తుది ఓటరు జాబితా ఆధారంగా 85ఏండ్లు నిండిన వృద్ధ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. వీరి నుంచి క్షేత్ర స్థాయిలో 12డీ దరఖాస్తు ఫారాన్ని స్వీకరిస్తున్నారు. ఓటు హక్కు కలిగి 85 ఏండ్లు పైబడిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు తప్పనిసరిగా 12డీ ఫారం తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. లేని పక్షంలో వారు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాల్సి ఉంటుంది.

ఓటరు జాబితా ఆధారంగా 85 ఏండ్లు పై బడిన వృద్ధుల నుంచి ఫారం 12డీ సేకరణకు బీఎల్ఓలను ఇంటింటికీ పంపిస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల విభాగం అధికారులు తెలిపారు.

15న 'స్వాలోయింగ్ ది సన్' పుస్తకావిష్కరణ

మాట్లాడుతున్న బాబీ

ఖైరతాబాద్, ఏప్రిల్ 10: ఐక్య రాజ్యసమితి మాజీ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ లక్ష్మి ముురుదేశ్వర్ పురి రచించిన 'స్వాలోయింగ్ ది సన్' పుస్తకాన్ని ఈ నెల 15న హోటల్ తాజ్‌కృష్ణలో ఆవిష్కరించనున్నట్లు ప్రభాఖైతాన్ ఫౌండేషన్ ప్రతినిధి బాబీ కందారియా తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. సివిల్ సర్వీస్ రంగంలో నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న లక్ష్మి ఇప్పటికే పలు పుస్తకాలు రచించారన్నారు. సమాజంలో స్ఫూర్తి రగిలించే ఆమె పుస్తకాల పంపరలో భాగంగా 15న పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి, ఢిల్లీ మాజీ లెఫ్టనెంట్ గవర్నర్ నజీబ్ జంగ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

పార్టీలు మారే నేతలకు బుద్ధి చెబుదాం..

బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేశ్

బంజారాహిల్స్, ఏప్రిల్ 10: వ్యక్తిగత స్వార్థాల కోసం పార్టీలు మారే నాయకులకు రానున్న ఎన్నికల్లో ఓటర్లు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో బీఆర్ఎస్ బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావును గెలిపించాలని కార్యకర్తలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తల శ్రమతో ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి మూడు నెలల్లోనే కాంగ్రెస్‌లోకి మారడమే కాకుండా ఎంపీగా పోటీ చేయడం సిగ్గుచేటని అన్నారు. అలాంటి వ్యక్తులను ఓడించడం ద్వారా భవిష్యత్తులో మరెవరూ ఇలాంటి పని చేయకుండా చూడవచ్చని పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన ఎంతో మంది కార్యకర్తలు కష్టపడి పనిచేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు.

సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పెరుక కిరణ్‌కుమార్, విష్ణునాయక్, శంకర్, జ్యోతి, దీపక్, రమణమ్మ, ప్రవంతి, విక్కీ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 10 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి గెలుపుకోసం పనిచేయాలని ఆ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో సునీతామహేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల కాలంలోనే ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నదని.. పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించేలా కార్యకర్తలు పనిచేయాలన్నారు. మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు శేరి సతీశ్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులున్నారు.

వడదెబ్బకు గురికాకుండా చర్యలు చేపట్టాలి..

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 10 : రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఎండలో పనిచేసేవారు, ప్రజలు వడదెబ్బకు గురికాకుండా చర్యలు చేపట్టాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య.. అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో 'జాతీయ కార్యక్రమం వాతావరణ మార్పు, మాన వ ఆరోగ్యం' అనే అంశంపై ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి రఘునాథ స్వామితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు కూడళ్ల వద్ద, పార్కుల వంటి స్థలాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, చలి వేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. బయటకు వెళ్లే ప్రతి ఒక్కరు తలపై టోపి, టవల్ ధరించి ఓఆర్ఎస్ కలిపిన నీటిని వెంట తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి